





రామేశ్వరం అగ్నితీర్థం, తంజావూరు కావేరి తీరం, కన్నియాకుమారి తీరంలో పితృదేవతలకు తర్పణాలు వదులుతున్న భక్తులు

మహాలయ అమావాస్య ఎఫెక్ట్..

తీర్థాలకు పోటెత్తిన భక్తులు



చదురగిరి ఆలయం వద్ద భక్తుల రద్దీ

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భంగా రామేశ్వరం, కన్నియాకుమారి, తిరుచ్చి, తంజావూరు, తిరువళ్లూరు, చదురగిరి ప్రాంతాల్లోని ప్రముఖ తీర్థాలకు ఆదివారం ఉదయం పితృదేవతలకు తర్పణాలు పెట్టేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివెళ్ళారు. రామేశ్వరం అగ్నితీర్థంలో లక్షలాది మంది భక్తులు పుణ్యస్నానమాచరించి పితృదేవతలకు తర్పణాలు విడిచారు. వేకువజాము ఐదు గంటల నుంచే రామేశ్వరం ఆలయం, పరిసర ప్రాంతాలు వేలాదిమంది భక్తులతో కిటకిటలాడింది. మహాలయ అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం వేకువజామునే ప్రధానార్చకులు రామనాధస్వామి ఆలయాన్ని తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశం నలుమూలల నుండి వచ్చిన భక్తులంతా అగ్నితీర్థంలో పితృదేవతలకు తర్పణాలు విడిచారు. రామేశ్వరం వచ్చిన భక్తులు చెన్నై, మదురై, కోయంబత్తూరు, తిరుచ్చి, బెంగళూరు తదితర నగరాలకు వెళ్లేందుకు ప్రత్యేక బస్సులను కూడా నడిపారు. ఇదే విధంగా రామనాధపురం జిల్లాలోని సేతుక్కరై, దేవీపట్టినం సముద్రతీర ప్రాంతాల్లో ప్రజలు పితృదేవతలకు తర్పణాలు వదిలారు.

త్రివేణి సంగమంలో...

కన్నియాకుమారిలోని త్రివేణి సంగమం ప్రాంతం వద్ద ఆదివారం వేకువజామునే వేల సంఖ్యలో భక్తులు పుణ్యస్నానమాచరించి పితృదేవతలకు తర్పణాలు విడిచారు. ఆ ప్రాంతంలోని సముద్రతీరం పొడవునా పురోహితులు భక్తులతో తర్పణాలు పెట్టించారు. ఆ తర్వాత భక్తులంతా కన్నియాకుమారిలోని ఆలయాలను దర్శించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవతి అమ్మవారికి వజ్రకిరీటం, మేలిమి వజ్రాలు పొదిగిన ముక్కుపుడకను ధరింపజేశారు. 11.30 గంటలకు అమ్మవారికి అలంకార దీపారాధన నిర్వహించారు.

కంచి, తిరువళ్లూరులో...

మహాలయ అమావాస్య సందర్భంగా కాంచీపురం, తిరువళ్లూరు జిల్లాలోని సుప్రసిద్ధ ఆలయాల్లో తీర్థ కొలనుల వద్ద పితృదేవతలకు తర్పణాలు సమర్పించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివెళ్ళారు. తిరువళ్లూరులోని వైద్య వీరరాఘవ పెరుమాళ్ ఆలయ తీర్థం వద్ద భక్తులు పురోహితుల సమక్షంలో పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. కాంచీపురంలోని సాత్తాల్ ఈశ్వరర్ ఆలయం, అత్తివరదర్ ఆలయం తదితర ఆలయాల వద్ద కూడా భక్తులు వేల సంఖ్యలో వెళ్ళి పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు. తిరుచ్చి సమీపంలోని కావేరి నదీ తీరం అమ్మామండపం వద్ద కూడా వేల సంఖ్యలో భక్తులు పితృదేవతలకు తర్పణాలు విడిచారు. విరుదునగర్ జిల్లా చదురగిరి సుందరమహాలింగేశ్వరాలయానికి వేల సంఖ్యలో వెళ్లిన భక్తులు స్వామివారిని దర్శించారు.

శ్రీవారి ఆలయంలో గొడుగులకు

విశేష పూజలు



కార్యక్రమంలో భాష్యకార కైంకర్య ట్రస్ట్ నిర్వాహకులు కె.దినేష్‌కుమార్, మాధవనాయుడు, ఏఈవో పార్థసారథి, మాజీ అధ్యక్షులు ఎన్.కృష్ణ, మాజీ సభ్యులు పీవీఆర్.కృష్ణారావు తదితరులు

చెన్నై, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై సమీపంలోని తిరునింద్రవూరుకు చెందిన భాష్యకార కైంకర్య ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 30 గొడుగులను శ్రీవారికి సమర్పించనున్నారు. ఆదివారం ఉదయం ఆ గొడుగులకు టి.నగర్‌లోని వేంకటేశ్వస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ఆలయ అర్చకులు గొడుగులకు పూజలు చేసి హారతులిచ్చారు. భాష్యకార కైంకర్య ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.దినేష్‌కుమార్, ఛైర్మెన్ అండ్ ట్రస్టీ మాధవనాయుడు, ట్రస్ట్ నిర్వాహకులు మనోహర్, ఎంఆర్.శేఖర్, ఎంజీ.లక్ష్మీపతి రామచంద్ర, మురళీ, రాజారమణ సారథ్యంలో ఈ గొడుగుల ఊరేగింపు కార్యక్రమం ప్రారంభించి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం టీటీడీ -చెన్నై ఏఈవో పార్థసారథి, మాజీ అధ్యక్షులు ఎన్.కృష్ణ, మాజీ సభ్యులు పీవీఆర్.కృష్ణారావు, ఊరా లక్ష్మీనరసింహారావు, మోహనరావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజేంద్రన్, అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రవర్తి ఆధ్వర్యంలో ఆలయంలోని శ్రీవారి సన్నిధిలో గొడుగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోవిందనామస్మరణల మధ్య నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. తర్వాత గొడుగులను ప్రత్యేక వాహనంలో తిరునింద్రవూరు భక్తవత్సల పెరుమాళ్ ఆలయానికి తరలించిన అనంతరం తిరుమలకు చేర్చారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ, చెన్నై టి.నగర్‌లోని శ్రీవారి ఆలయంలో గొడుగులకు పూజలు నిర్వహించడం తనకెంతో ఆనందంగా ఉందని, తమకు ఈ అవకాశాన్ని కల్పించిన టీటీడీ ఆలయ నిర్వాహకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మొత్తం 30 గొడుగులను శ్రీవారికి సమర్పిస్తున్నామని, అందులో రెండు గొడుగులను చెన్నై శ్రీవారి ఆలయానికి, 17 గొడుగులు తిరుపతి గోవిందరాజస్వామి ఆలయానికి, మిగిలిన 9 గొడుగులు తిరుమల వెంకటేశ్వరస్వామి వారి గరుడసేవ కోసం ఆలయాల అధికారులకు అందజేసినట్లు తెలిపారు.

అసెంబ్లీ ఎన్నికల్లో 30 స్థానాల్లో పోటీ

పీఎంకే నేత రాందాస్ నిర్ణయం



చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఏ కూటమిలో చేరినా 30 నియోజకవర్గాల్లో పోటీ చేసేలా పొత్తు ఖరారు చేసుకోవాలని పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ అధ్యక్షతన దిండివనంలోని ఆయన నివాసలో ఆదివారం జరిగిన పార్టీ ఉన్నత కార్యాచరణ మండలి సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి, రాందాస్ కుమార్తె శ్రీకాంతి, సేలం ఎమ్మెల్యే అరుళ్, అన్బళగన్, పరంథామన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాందాస్ నాయకత్వంలోని పార్టీకే గుర్తింపు ఇవ్వాలని కోరుతూ త్వరలో పార్టీ నేతలు ఢిల్లీ వెళ్ళి కేంద్ర ఎన్నికల సంఘానికి వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో పార్టీకి ఓటు బ్యాంక్ పెరుగుతోందని, ఈ సారి శాసనసభ ఎన్నికల్లో 30 నియోజకవర్గాలలో పోటీ చేసి తీరాలని పార్టీ సీనియర్ నేతలు అభిప్రాయపడ్డారు.

త్వరలో అమిత్‌షాతో భేటీ...

ఇదిలా ఉండగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌ను కలుసుకునేందుకు రాందాస్ త్వరలో ఢిల్లీ వెళ్లనున్నారని ఆయన సహచరులు తెలిపారు. ఆ మేరకు అమిత్‌షా అప్పాయింట్‌మెంట్ కోరినట్లు చెప్పారు. ఇక పార్టీని పటిష్టపరిచేందుకు మంగళవారం పీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం జరుపనున్నారు. వన్నియార్ల సంఘం జిల్లా నేతల, జిల్లా కార్యదర్శుల సమావేశం బుధవారం నిర్వహించనున్నారు.

ఓపీఎస్, దినకరన్ వస్తే చేర్చుకుంటాం

● బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్



ఈపీఎస్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాగేంద్రన్

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓపీఎస్, టీటీవీ దినకరన్ కూటమిలో చేరితే ఆహ్వానిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ తెలిపారు. సేలంలో ఆదివారం ఉదయం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)తో నయినార్ నాగేంద్రన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాగేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ... జీఎస్టీ తగ్గింపును దేశ ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారన్నారు. బీజేపీ ఓట్ల రిగ్గింగ్‌కు పాల్పడుతుందని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారని, మేము రిగ్గింగ్‌కు పాల్పడి ఉంటే గత శాసనసభ ఎన్నికల్లో డీఎంకే గెలిచేది కాదన్నారు. రాష్ట్ర జాలర్ల విషయంలో బీజేపీని విమర్శిస్తూ విజయ్ మాట్లాడారని, ఇప్పటివరకు ఆయన ఎన్నికలు ఎదుర్కొనలేదని, ఇప్పుడే వస్తున్నారని, వచ్చిన వెంటనే అధికారం చేపడతామని భావిస్తున్నారని, ఆయనకు రాష్ట్ర ప్రజలు ఓటు వేస్తారా? లేదా? అనేది అనుమానమేనన్నారు. అన్నామలై కొత్త పార్టీ ప్రారంభించనున్నారని వార్తలు వస్తున్నాయని, ఆయన మా పార్టీ మాజీ అధ్యక్షుడని, ప్రస్తుతం పార్టీలోనే ఉన్నారని తెలిపారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారంలో తాము జోక్యం చేసుకోమన్నారు.

సీఎం స్టాలిన్

అన్నాడీఎంకే పాలన కంటే రెండింతల అభివృద్ధి



చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ద్రావిడతరహా పాలనలో రాష్ట్రం గత అన్నాడీఎంకే పాలనకంటే అన్ని రంగాల్లో రెండింతల అభివృద్ధి సాధించిందని, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో పురోగమిస్తోందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. 'మక్కలుడన్ స్టాలిన్' యాప్‌లో వివిధ ప్రాంతాల ప్రజలడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. అందరికీ అన్ని సదుపాయాలు కల్పించి, సామాజిక న్యాయాన్ని ఏర్పరచడమే ద్రావిడ తరహా పాలన అని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధఃపాతాళానికి చేరిందని, దానికి తోడు కొవిడ్ ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిందని, ఇలాంటి గడ్డు పరిస్థితులను అధిగమించి గత నాలుగున్నరేళ్లలో దేశంలోనే 11.19 శాతం ఆర్థికాభివృద్ధిని సాధించిన రాష్ట్రంగా నిలిచిందన్నారు. ఉత్పత్తుల రంగాల్లో తమ ప్రభుత్వం సుమారు 73 లక్షలమందికి ఉపాధి అవకాశాలు కల్పించామని, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చామని, ఇళ్లవద్దకే వైద్యం, బడిపిల్లలకు అల్పాహారం, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి పథకాలు అమలు చేయడం వల్లే అన్ని రాష్ట్రాలకు ఆదర్శరాష్టంగా నిలిచామని స్టాలిన్ వివరించారు. రాష్ట్రంలో బీజేపీ తమ సిద్ధాంతాలతో ప్రజలను ఆకట్టుకుని పార్టీని అభివృద్ధి పరచాలని ఎన్నడూ భావించలేదని, దొడ్డిదారినే ద్రావిడ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పార్టీని అభివృద్ధి చేయాలనుకుంటోందని ఆయన విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలవలేమన్న భయంతోనే ఎన్నికలకు పది నెలలకు ముందే అత్యవసరంగా అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేని, ప్రత్యేకంగా అన్నాడీఎంకేని చిత్తుగా ఓడించి తీరుతామని స్టాలిన్ పేర్కొన్నారు. రెండోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సమున్నత స్థితికి తీసుకెళతానని, ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

శబరిమలలో ఐదెకరాల స్థలం ఇవ్వండి

● కేరళ ప్రభుత్వానికి మంత్రి శేఖర్‌బాబు వినతి

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శబరిమలలో ఐదు ఎకరాల స్థలం రాష్ట్రానికి కేటాయిస్తే, అది రాష్ట్ర భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని దేవదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేరళ రాష్ట్రం పంబలో జరిగిన అంతర్జాతీయ అయ్యప్ప భక్తుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి శేఖర్‌బాబు మాట్లాడుతూ... కేరళ, తమిళనాడు రాష్ట్రాల మధ్య మంచి సత్సంబంధాలున్నాయన్నారు. శబరిమలలో 5 ఎకరాల స్థలం తమిళనాడుకు కేటాయించాలని, అది తమిళనాడు నుంచి వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అలాగే, తమిళనాడు-కేరళ సరిహద్దుల్లో ఉన్న కన్నగి ఆలయ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశం పాల్గొన్న రాష్ట్ర మంత్రి పళనివేల్ త్యాగరాజన్ మాట్లాడుతూ... కేరళ ప్రభుత్వం శబరిమలలో ఏర్పాటుచేయనున్న రైలు మార్గం, రోప్ కార్, విమానాశ్రయం తదితర పథకాలకు తమిళనాడు ఎప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేరళ సీఎం పినరయి విజయన్, ఆ రాష్ట్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ అయ్యప్ప భక్తుల సమ్మేళనంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి శేఖర్‌బాబు

నడిగర్ సంఘం సర్వసభ్య సమావేశం

● 16 తీర్మానాలకు ఆమోదం

● గైర్హాజరైన అగ్రహీరోలు

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): . నడిగర్ సంఘ (దక్షిణ భారత నటీనటులు సంఘం) సర్వసభ్య మండలి 69వ సమావేశం ఆదివారం తేనాంపేటలోని కామరాజర్ అరంగంలో జరిగింది. ఈ సమావేశానికి అగ్ర నటులు రజనీకాంత్, కమల్, విజయ్, అజిత్, విక్రమ్, సూర్య, శింబు, ధనుష్, శివకార్తికేయన్, విజయ్ సేతుపతి, యోగిబాబుతో పాటు అగ్ర హీరోయిన్లు కూడా గైర్హాజరయ్యారు. నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి విశాల్, కోశాధికారి కార్తి, ఉపాధ్యక్షులు పూచ్చి మురుగన్, కరుణాస్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, సర్వసభ్యులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందుగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ తర్వాత ఈ యేడాది దివంగతులైన సరోజాదేవి, రోబో శంకర్, మనోజ్, ఢిల్లీ గణేష్ సహా మొత్తం 70 మందికి నివాళులర్పించారు. అనంతరం సర్వసభ్య సమావేశం నిర్వహించి ఈ యేడాది ఆదాయ వ్యయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా అలనాటి నటి ఎంఎన్ రాజంకు 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం చేశారు. జాతీయ అవార్డు గ్రహీతలైన సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, నటుడు ఎంఎస్ భాస్కర్, నటి ఊర్వశిలను సన్మానించారు. 'దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు'కు ఎంపికైన మళయాల నటుడు మోహన్‌లాల్‌కు నడిగర్ సంఘం అభినందనలు తెలుపుతూ తీర్మానం చేసింది.. ఆ తర్వాత నడిగర్ సంఘం భవన నిర్మాణానికి మరో రూ.10 కోట్ల రుణం తీసుకునేందుకు తీర్మానం చేసి సభ్యుల అనుమతి కోరారు. మొత్తం 16 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఆ తర్వాత అధ్యక్షుడు నాజర్ మీడియాతో మాట్లాడుతూ, సోషల్ మీడియాలో నటీనటులపై అసత్య ప్రచారంపై మరింత సీరియస్‌గా దృష్టిసారించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన కార్యదర్శి విశాల్ మాట్లాడుతూ, నడిగర్ సంఘం భవన నిర్మాణ పనులు చాలా మేరకు పూర్తయ్యాయని, మిగిలిన పనులను పూర్తి చేయడానికి అవసమైన నిధుల కోసం రుణం తీసుకునేందుకు సర్వసభ్య మండలి అనుమతి కోరినట్టు చెప్పారు. కోశాధికారి కార్తి మాట్లాడుతూ, నడిగర్ సంఘం భవనాన్ని రూ.40 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. కాగా సమావేశంలో అంబిర, రేఖ, రోహిణి వంటి కొందరు నటీమణులు హాజరయ్యారు.



దివంగత నటుల చిత్రపటాలకు నాజర్ నివాళి



ప్రముఖ నటి ఎంఎన్ రాజంకు జీవనసాఫల్య పురస్కారంతో సత్కరిస్తున్న నడిగర్ సంఘం నిర్వాహకులు

సమాచార ధ్వని

అసిస్టెంట్ వైర్‌మన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బోర్డులో అసిస్టెంట్ వైర్‌మన్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగావకాశాలు, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 13,14 తేదీల్లో అసిస్టెంట్ వైర్‌మెన్ పోస్టుల భర్తీకి రాత పరీక్ష నిర్వహించనుంది. ఈ పోస్టుకు సంబంధించిన విద్యార్హతలు, మరిన్ని వివరాలు, దరఖాస్తు జ్ఞిఇట//ఙఘజీజూజ్బాట్బజీజీజ్బ్జ.ఙౌరి.జీ అనే వెబ్‌సైట్‌లో నమోదుచేయవచ్చని ఉద్యోగ అవకాశాల డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు డీఎంకే ఎంపీల సమావేశం

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఆ పార్టీ ఎంపీల సమావేశం మంగళవారం జరుగనుంది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో.... తేనాంపేటలోని అన్నా అరివాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగనున్న సమావేశంలో పార్లమెంటు, రాజసభ సభ్యులు హాజరుకావాలని కోరారు.

తాగునీటి ఫిర్యాదులపై ప్రత్యేక యాప్

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో వాటర్ బోర్డుకు సంబంధించి అన్ని ఫిర్యాదులు ఒకేచోట నమోదుచేసేలా కొత్త యాప్ పరిచయం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో... 'చెన్నై మెట్రో వాటర్‌కు సంబంధించిన అన్ని ఫిర్యాదులు సులభంగా నమోదుచేసేలా 'చెన్నై కుడినీర్ సెయలి' అనే కొత్త మొబైల్ యాప్ పరిచయం చేశామన్నారు. ఫిర్యాదుకు సంబంధించిన ఫొటో, ప్రాంతం పేర్కొనవచ్చని, ఈ సమస్యను అసిస్టెంట్ ఇంజనీర్లు సత్వరం పరిష్కరిస్తారని తెలిపారు. 48 గంటల్లోపు ఎరిష్కారం కాకపోతే అదే యాప్‌లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే సదుపాయం కల్పించినట్లు సీఎం తన ఎక్స్‌లో పేర్కొన్నారు.

రూపాయి తగ్గనున్న 'రైల్ నీర్'

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్లలో విక్రయిస్తున్న రైల్ నీర్ ధర రూ.1 తగ్గుతుందని రైల్వే బోర్డు తెలిపింది. ఈ మేరకు అన్ని మండల కార్యాలయాలు, ఐఆర్‌సీటీసీకి రైల్వే బోర్డు సర్క్యులర్ జారీచేసింది. ఆ ప్రకారం, రైల్వే స్టేషన్లలో విక్రయించే లీటరు రైల్ నీర్ బాటిల్ ధర రూ.15 నుంచి రూ.14, అర లీటరు బాటిల్ ధర రూ.10 నుంచి రూ.9కి విక్రయించనున్నారు. ఈ తగ్గింపు సోమవారం నుంచి అమలుకు వస్తుందని రైల్వే అధికారులు తెలిపారు.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు (టీఎన్ఈబీ) ప్రకటించింది. కోయంబేడు మార్కెట్ సమీపంలోని శ్రీనివాసనగర్, భక్తవత్సలంవీధి, సేమాత్తమ్మన్‌నగర్, మేట్టుకుళం, న్యూకాలనీ, తిరువీథియమ్మన్ కోవిల్‌వీధి, చిన్మయానగర్, నెర్‌కుండ్రం, ఆళ్వార్‌తిరునగర్, మూగాంబికానగర్, కృష్ణానగర్, భువనేశ్వరినగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి యధావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందని టీఎన్ఈబీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

10వ తరగతి విద్యార్థుల వివరాల సవరణకు అవకాశం

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సుమారు 8.50 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల వివరాలు 'ఎమిస్' వెబ్‌సైట్‌లో నమోదుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఉన్నత, మహోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ పంపిన సర్క్యులర్‌లో... 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల వివరాల్లో సవరణలుంటే అక్టోబరు 6 నుంచి 28వ తేది వరకు చేపట్టాలని సూచించింది. విద్యార్థి పేరు, చిరునామా, తల్లిదండ్రులు, సంరక్షకుల పేర్లలో సవరణలు చేపట్టవచ్చని తెలిపింది. విద్యార్థి జనన ధృవీకరణ పత్రంలో ఉన్నట్లుగా విద్యార్థి పేరు ఉండాలని సూచించింది. అలాగే, దివ్యాంగ విద్యార్థులకు పరీక్షల్లో సహాయం చేసేలా, ఆ విద్యార్థి గుర్తింపు కార్డు లేదా వైద్యుల సర్టిఫికేట్ అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

గ్రామ సహాయకుల పోస్టులకు వయోఃపరిమితి పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా నియమించనున్న గ్రామ సహాయకుల పోస్టులకు వయోఃపరిమితి సడలింపునకు సంబంధించిన జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సహాయకుల పోస్టుల భర్తీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అముద విడుదల చేసిన ప్రకటనలో... గ్రామ సహాయకుల పోస్టుల భర్తీ ప్రత్యక్షంగా చేపట్టనున్నామన్నారు. ప్రస్తుతం ఈ పోస్టులకు సంబంధించి జనరల్ అభ్యర్థులు వయోఃపరిమితి 32 ఏళ్లు, బీసీ, ఎంబీసీ వర్గాలకు 39, ఎస్సీ, ఎస్టీలకు గరిష్ఠ వయోఃపరిమితి 42 ఏళ్లుగా సడలించినట్లు పేర్కొన్నారు.

గిండి రేస్ క్లబ్ ప్రాంతానికి చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి రేస్ క్లబ్ ప్రాంతానికి చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం మారనుంది. ప్రస్తుతం చెన్నై బీచ్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న కలెక్టర్ కార్యాలయంలో కొత్తగా కోర్టు భవనాల సముదాయం ఏర్పాటుచేయనున్నారు. ఈ కారణంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం మార్చనున్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయం, జిల్లా రెవెన్యూ కార్యాలయం సహా అన్ని వసతులతో కొత్త కలెక్టర్ భవన సముదాయం నిర్మించనున్నారు. గిండి వెంకటాపురం గ్రామంలోని రేస్ క్లబ్ భవనం కూల్చివేసిన నేపథ్యంలో, ఆ ప్రాంతంలో ఖాళీగా ఉన్న 1.43 హెక్టార్లలో చెన్నై కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రెవెన్యూ విపత్తుల నిర్వహణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అముద ఉత్తర్వులు జారీచేశారు.

మేల్ మరువత్తూరులో నవరాత్రి వేడుకలు ప్రారంభం

ప్యారీస్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మేల్ మరువత్తూరు ఆదిపరాశక్తి పీఠంలో మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా నవరాత్రి వేడుకలను పీఠాధిపతి లక్ష్మీ బంగారు అడిగలార్ అఖండ దీపం వెలిగించి ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ పీఠంలో ప్రతిఏటా 12 రోజుల పాటు శరన్నవ రాత్రి వేడుకలను నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఉత్సవాలను మధ్య, తూర్పు, ఉత్తర, దక్షిణ చెన్నై జిల్లాల భక్తుల తరుపున లక్ష్మీ బంగారు అడిగలార్ గర్భగుడి ముందు ఆదివారం ఉదయం అఖండ దీపం వెలిగించి ప్రారంభించారు. ఈ వేడుకల్లో పీఠం నిర్వాహకులు అన్బలగన్, సెంథిల్‌కుమార్, ఆశా, శ్రీలేఖ సహా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మహాలయ అమావాస్య సందర్భంగా అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, లక్షార్చన పూజలు నిర్వహించారు. నవరాత్రి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరిని ఆకట్టుకుంటుంది.



అఖండ దీపం వెలిగిస్తున్న లక్ష్మీ బంగారు అడిగలార్

సాంకేతికలోపంతో నిలిచిన వందే భారత్

● 3 గంటల ఆలస్యంగా రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరానికి వస్తున్న వందే భారత్ రైలింజన్ హఠాత్తుగా మరమ్మతులకు గురికావడంతో మార్గమధ్యంలో నిలిచిపోయింది. దీంతో, నగరానికి రావాల్సిన పలు రైళ్లు మూడు గంటలు ఆలస్యంగా చేరుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం మైసూరు నుంచి శనివారం జోలార్‌పేట మీదుగా చెన్నై వస్తున్న వందే భార్ రైలు, సాయంత్రం 4.40 గంటలకు తిరుపత్తూర్ జిల్లా పచ్చూర్ రైల్వేస్టేషన్ దాటిన సమయంలో హఠాత్తుగా ఇంజన్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో నిలిచిపోయింది. అనంతరం లోకోపైలట్ సాంకేతిక లోపం సవరించి రైలు నడిపాడు. రైలు 15 నిమిషాలు వెళ్లిన తర్వాత సోమనాయకన్‌పట్టి రైల్వేస్టేషన్ సమీపంలో హఠాత్తుగా నిలిచిపోయింది. దీంతో రైలింజన్ డ్రైవర్ జోలార్‌పేట రైల్వే అధికారులకు సమాచారం అందించాడు. సాంకేతిక నిపుణులు అక్కడకు చేరుకుని మరమ్మతులు చేపట్టారు. ఈ కారణంగా, బెంగళూరు నుంచి జోలార్‌పేట చేరుకున్న భువనేష్ ఎక్స్‌ప్రెస్, పాండిచ్చేరి ఎక్స్‌ప్రెస్, గౌహతి ఎక్స్‌ప్రెస్ సహా ఏడు రైళ్లు అక్కడికక్కడే నిలిచిపోయాయి. రెండు గంటలు మరమ్మతులు పనులు చేపట్టినా సాంకేతికలోపం సరికాకపోవడంతో, బెంగళూరు నుంచి మరో రైలింజన్ రప్పించి, వందే భారత్ రైలుకు జతచేసి పంపించారు. అనంతరం అక్కడక్కడే నిలిచిన రైళ్లను ఒకదాని తర్వాత మరొకటిగా పంపించగా, ఒక్కో రైలు మూడు గంటల ఆలస్యంగా చెన్నై చేరుకోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నేటినుంచి కాకలూరులో నవరాత్రి వేడుకలు

ప్యారీస్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కాకలూరు మారుతి న్యూటౌన్‌లోని సెల్వగణపతి దేవాలయం, రామాలయంలో తృతీయ వార్షిక నవరాత్రి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. అక్టోబర్ 1వ తేదీ వరకు జరుగనున్న ఈ వేడుకల్లో అమ్మవారు ప్రతిరోజు ఒక్కో ప్రత్యేక అలంకారంలో పూజలందుకుంటారని ఆలయ స్థాపకులు శ్రీమన్నారాయణ, నిర్వాహకులు తెలిపారు.

తిరువూరులో...

సెవ్వాపేట రోడ్డు తిరువూరులో కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం నుండి ప్రారంభంకానున్న నవరాత్రి వేడుకలు అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 1న సామూహిక కుంకుమార్చన, మహాహారతి, 2వ తేదీ సాయంత్రం గణపతిపూజ, హోమం, దీపారాధన, పారువేట ఊరేగింపు, కన్నిపూజల్లో భక్తులందరూ పాల్గొనాల్సిందిగా ఆలయ నిర్వాహకులు డి.రవిచంద్రన్, చీమకుర్తి గోవిందరాజులు, కెకె.త్రినాథ్‌కుమార్ పిలుపునిచ్చారు.

ఎస్‌కేపీడీలో...

స్థానిక కొత్వాల్ బజార్ ఆదియప్పనాయకన్ వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో విశ్వావసు నామసంవత్సర నవరాత్రి మహోత్సవం ఈ నెల 22న ప్రారంభమవుతుందని ఆలయ ట్రస్టీలు తెలిపారు. సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరి మూల మంత్రహోమం, విశేషపూజలతో నవరాత్రి వేడుకలను ప్రారంభిస్తారు. అక్టోబర్ 2వ తేదీ వరకు అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. భక్తులు నవరాత్రి పూజల్లో పాల్గొనాలని ఎస్‌కేపీడీ ఛారిటీస్ సభ్యులు పిలుపునిచ్చారు.

అక్షయబాబా మందిరంలో...

బ్రాడ్వే ఆచారప్పన్‌వీధిలో ఉన్న అక్షయబాబా ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతాయి. 26వ తేదీ శుక్రవారం నవకన్యపూజ, విశేషకుంకుమార్చన, సుమంగళి పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 2వ తేదీ గురువారం విజయదశమి, సాయిబాబా సమాధి దినోత్సవం సందర్భంగా మహాగణపతి హోమం, దుర్గా, లక్ష్మీ, సరస్వతి హోమం, సమస్త దేవతాహోమం, సాయినాథహోమం, విశేషాభిషేకం, అలంకారం, మహాదీపారాధన పూజలు నిర్వహించనున్నట్లు జై వాసవీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు తెలిపారు.

కమల్ హాసన్ ఎంపీ అయ్యారు...

మరి పార్టీ శ్రేణుల పరిస్థితి ఏమిటీ...?

● తమిళిసై సౌందర్‌రాజన్

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ ఎంపీ అయ్యారని, మరి ఆ కార్యకర్తల పరిస్థితి ఏమిటని? బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ ప్రశ్నించారు. మదురైలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... ఎలాంటి లక్ష్యం, సిద్ధాంతాలు లేని వారు రాజకీయ పార్టీలు ప్రారంభిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై పనిచేస్తే ఆ పార్టీకి తగిన గుర్తింపు వస్తుందన్నారు. కానీ, వారు తమ స్వలాభం కోసం పార్టీని బలిచేస్తున్నారన్నారు. ఉదాహరణకు కమల్ హాసన్ రాజకీయ పార్టీ ప్రారంభించారని, అనంతరం ఆయన డీఎంకేతో పొత్తు కుదుర్చుకుని ఎంపీ సీటు చేజిక్కించుకున్నారని, ఆయనను నమ్మి పార్టీలోకి వచ్చిన కార్యకర్తలు పరిస్థితి ఏమిటనీ? ప్రశ్నించారు. మరెవరో రాసిన స్క్రిప్ట్ టీవీకే అధ్యక్షుడు విజయ్ చదువుతున్నారని, ఆ స్క్రిప్ట్ సరిగా లేదని, అందువల్ల అనుభవం ఉన్న తమను సంప్రదిస్తే మంచి స్క్రిప్ట్ అందజేస్తామని తమిళిసై ఎద్దేవా చేశారు.

కనిమొళి సభలోనూ వచ్చిన అంబులెన్స్



అంబులెన్స్‌కు దారివ్వాలని కోరుతున్న ఎంపీ కనిమొళి

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి తూర్పు జిల్లా ఆధ్వర్యంలో 'తమినాడును తలదించనివ్వం' పేరుతో శనివారం రాత్రి బహిరంగ సభ నిర్వహించారు. నాగర్‌కోయిల్‌లో జరిగిన ఈ సభలో డీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి, ఎంపీ కనిమొళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఏకతాటిపై తమిళనాడు' కార్యక్రమం ద్వారా పార్టీ సభ్యత్వం పొందిన కార్యకర్తలతో కనిమొళి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతున్న సమయంలో అంబులెన్స్ వచ్చింది. తన ప్రసంగం నిలిపి అంబులెన్స్‌కు దారివ్వాలని కార్యకర్తలకు కనిమొళి విజ్ఞప్తి చేసింది. కాగా తమ ప్రచార సభల్లో ఖాళీ అంబులెన్స్‌లు పంపి గందరగోళం సృష్టిస్తున్నారని ఇటీవల ప్రతిపక్ష నేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించడం గమనార్హం.

'మేం విషం తాగాం...కాపాడండి'

● పోలీసులను ఆశ్రయించిన జంట ● ఆస్పత్రిలో చికిత్స ఫలించక మృతి

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కలిగిన ఓ జంట విషం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తూత్తుకుడి జిల్లా కయత్తారు సాలైపుదూర్ ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ తంగవేల్‌స్వామి (28)కి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. తంగవేల్‌స్వామి కొద్ది నెలల క్రితం తిరునల్వేలి జిల్లా వన్నార్‌పేటలో ఉంటూ విధులకు వెళ్తున్నారు. సమీపంలోని ఆటో డ్రైవర్ భార్య పార్వతితో తంగవేల్‌స్వామికి ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఆ విషయం ఇరు కుటుంబాలకు తెలియడంతో వారు మందలించారు. ఆ నేపథ్యంలో శుక్రవారం పార్వతి, తంగవేల్‌స్వామితో కలసి కారులో కులశేఖరపట్టణానికి చేరుకుంది. ఇద్దరూ ఇంటికి తిరిగి వెళ్తే విడదీస్తారని భావించి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని పురుగుల మందు తాగారు. కొద్దిసేపటికి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ కులశేఖరపట్టణం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తాము విషం తాగామని, తమను కాపాడాలని కోరారు. పోలీసులు, వారిని వెంటనే ప్రాథమిక చికిత్స చేయించి, మెరుగైన చికిత్సకు తిరుచెందూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో తంగవేల్‌స్వామి, పార్వతి ఒకరి తర్వాత మరొకరు మృతిచెందారు. దీనిపై కులశేఖరపట్టణం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రికవరీ చేసిన సొమ్ము చోరీ

● మహిళా ఇన్‌స్పెక్టర్ బదిలీ

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రికవరీ చేసిన రూ.75 వేలు లెక్కల్లో చూపని మహిళా ఇన్‌స్పెక్టర్ సాయుధదళానికి బదిలీ అయ్యారు. కడలూరు జిల్లా కొరకవాడి గ్రామానికి చెందిన అమ్మనియమ్మాళ్ (60) ఘటన జరిగిన రోజున ఉపాధి పథకం పనులకు కొరకవాడి-వనయనల్లూర్ రోడ్డుపై నడిచి వెళుతోంది. ఆ సమయంలో బైక్‌పై వచ్చిన పెరంబలూరు జిల్లా కీళపులియూర్ గ్రామానికి చెందిన ప్రభాకరన్ (39) లిఫ్ట్ ఇస్తానని చెప్పి అమ్మనియమ్మాళ్ ఎక్కించుకుని ఎవరూ లేని ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె ధరించిన మూడు సవర్ల నగలు, రూ.75 వేల నగదు చోరీ చేసి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో రామనత్తం సీఐ బృంద విచారణ చేపట్టి, ప్రభాకరన్‌ను అరెస్ట్ చేసి నగలు, నగదు స్వాధీనం చేసుకుంది. కానీ, స్వాధీనం చేసుకున్న నగదును ఆమె లెక్కలో చూపకపోవడంతో అధికారులు విచారణ చేపట్టి, నగదు ఇన్‌స్పెక్టర్ తీసుకున్నట్లు తెలుసుకున్నారు. ఈ కారణంగా ఆమెను సాయుధ దళానికి బదిలీ చేస్తూ ఎస్పీ జయకుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

నాగూర్ దేవుడి దయతో రాష్ట్రంలో మంచి మార్పులు

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగూర్ దేవుడి దయంతో రాష్ట్రంలో మంచి మార్పులు వస్తాయని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి తెలిపారు. నాగపట్టణం జిల్లా వేదారణ్యంలో ఆదివారం సాయంత్రం పార్టీ బహిరంగ సభలో అన్బుమణి పాల్గొన్నారు. ఉదయం కుంభకోణం నుంచి నాగూర్ దర్గాకు చేరుకున్నారు. దర్గా ప్రవేశద్వారంలో నిర్వాహకులు, ఆయనకు ఆహ్వానం పలికారు. అనంతరం దర్గాలో ఆండవర్ సమాధి వద్ద అన్బుమణి పూజలు నిర్వహించారు.



నాగూర్ దర్గాను సందర్శించిన అన్బుమణి

తల్లీకూతుళ్ల హత్యకేసులో నిందితుడికి మూడు యావజ్జీవ శిక్షలు

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కడలూరు సమీపంలో తల్లీకూతుళ్లను హతమార్చిన కొబ్బరి బోండాల వ్యాపారికి మూడు యావజ్జీవ జైలుశిక్షలు విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. పుదుచ్చేరికి చెందిన కొబ్బరి బోండాల వ్యాపారి ఇరుసయప్పన్, నగల కోసం విజయలక్ష్మి అనే మహిళను, ఆమె కుమార్తె సత్యను దారుణంగా హతమార్చాడు. ఈ కేసుపై విచారణ జరిపిన కడలూరు కోర్టు ఇరుసయప్పన్‌కు మూడు యావజ్జీవ కారాగార శిక్షలు విధిస్తూ తీర్పునిచ్చింది.

ఏనుగు దాడిలో రైతు మృతి

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో రైతు మృతిచెందిన ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. గోపి సమీపం వినోబా నగర్‌కు చెందిన రైతు పెరియస్వామి (35) శనివారం తన పొలం నుంచి వస్తున్న సమయంలో, హఠాత్తుగా పొదల చాటు నుంచి వచ్చిన ఏనుగు అతడిని తొండంతో పట్టుకుని తిప్పి విసిరేయడంతో అతను ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నటుడు ఎస్వీ శేఖర్ ఇంటికి మళ్లీ బాంబు బెదిరింపు

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వారంతో రెండో సారి నటుడు ఎస్వీ శేఖర్ ఇంటికి బాంబు బెదిరింపు వచ్చింది. రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి శనివారం రాత్రి వచ్చిన ఈ-మెయిల్‌లో... మందవెల్లిలో నివసిస్తున్న నటుడు ఎస్వీ శేఖర్ ఇంట్లో కొద్దిసేపట్లో బాంబు పేలుతుందని రాసి ఉంది. దీంతో, అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్, పోలీసు జాగిలంతో శేఖర్ ఇంటికి చేరుకుని, ఇల్లు, పరిసరాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం సైబర్ క్రైం పోలీసులు విచారిస్తున్నారు.

పీఎంకే అధికార ప్రతినిధిగా ఎమ్మెల్యే అరుళ్

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీఎంకే అధికార ప్రతినిధిగా ఎమ్మెల్యే బాబును ఆ పార్టీ అధ్యక్షులు రాందాస్ నియమించారు. పీఎంకేలో రాందాస్, కుమారుడు అన్బుమణి మధ్య విభేదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇద్దరూ పోటాపోటీగా తమ తమ అనుచరులను పార్టీ పదవుల్లో నియమిస్తున్నారు. ఈ క్రమంలో, పార్టీ అధికార ప్రతినిధిగా ఎమ్మెల్యే బాబును రాందాస్ నియమించారు. ఎమ్మెల్యే బాబు ఇప్పటికే పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి బాధ్యతలు వహిస్తున్నారు.

ఎంసీటీబీసీలో ఘనంగా కోతకాలపు పండుగ

ప్యారీస్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెపేరి హైరోడ్డులోని మద్రాస్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘం (ఎంసీటీబీసీ)లో ఆదివారం కోతకాలపు పండుగ ఘనంగా జరుపుకున్నారు. సంఘ స్త్రీల సమాజం, యూత్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ పండుగను సంఘ కాపరి రెవ.డా.ఎస్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. రెవ.ఎంపీ ప్రసన్నకుమార్, సంఘ ప్రోటెర్మ్ చైర్మెన్ ఎబాస్కర్, రికార్డింగ్ కార్యదర్శి శేషం రమేష్‌లు, సంఘ సభ్యులు తమ కుటుంబాలతో పాల్గొని ప్రపంచంలో శాంతి నెలకొనాలని, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడాలని ప్రార్థించారు. కాగా, ఏడాదిలో తమ సంపాదనలో, కోసిన పంటలో పదోవంతును భక్తులు దేవుడికి కానుకగా సమర్పించే వేడుకను తెలుగు బాప్టిస్టు క్రైస్తవులు కోతకాలపు పండుగ, కానుకల పండుగగా ప్రతిఏటా కోలాహలంగా జరుపుకుంటుంటారు. ఇందులో భాగంగా ఎంసీటీబీసీలో నిర్వహించిన కోతకాలపు పండుగను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో రాగి సంగటి, గోంగూర మటన్, బొబ్బట్లు, అరిసెలు, జంతికలు తదితర వంటలను ఆహార ప్రియులు తృప్తిగా ఆరగించారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు వచ్చే నీటి ప్రవాహం పెరిగింది. శనివారం సాయంత్రం డ్యాంకు 9,731 ఘనపుటడుగులుగా వస్తున్న జలాలు ఆదివారం ఉదయం 11,396 ఘనపుటడుగులకు పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 91.28 టీఎంసీల నీరుందని ఇరిగేషన్ విభాగం అధికారులు తెలిపారు.

విజయ్ ఒంటరిగా పోటీచేస్తే టీవీకే అడ్రస్ గల్లంతు

● మాజీ మంత్రి రాజేంద్ర బాలాజి

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న శాసనసభ ఎన్నికల్లో విజయ్ ఒంటరిగా పోటీ చేస్తే, ఆయన నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అడ్రస్ గల్లంతవుతుందని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి రాజేంద్ర బాలాజి పేర్కొన్నారు. విరుదునగర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తిరువారూర్‌లో జరిగిన సభలో, డీఎంకే-టీవీకే మధ్య పోటీ అని విజయ్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒంటరిగా పోటీచేసి గెలుస్తాం అనే విజయ్ కోరిక ఇప్పుడే కాదు, ఎప్పుడూ తీరదన్నారు. విజయ్‌కు 35 పాస్ మార్కులు రావాలంటే పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకేతో పొత్తు కుదుర్చుకోవాలన్నారు. అలా చేయని పక్షంలో డీఎంకే చేతిలో ఆయన పార్టీ అడ్రస్ లేకుండా పోతుందన్నారు. నటుడుగా ఆయనను చూసేందుకు ప్రజలు వస్తున్నారని, అదే అజిత్, సూపర్ స్టార్ రజనీకాంత్‌ను చూసేందుకు అంతకంటే రెట్టింపు ప్రజలు వస్తారని రాజేంద్ర బాలాజి పేర్కొన్నారు.

తిరువళ్లూరులో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కావటంతో స్తంభంపై వేలాడుతున్న వైర్లు

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు సమీపం కున్నవరం గ్రామంలో పొలాల నడుమ విద్యుత్ స్తంభంపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు ఆదివారం వేకువజామున చోరీ చేసుకెళ్లారు. విద్యుత్ సిబ్బంది కొద్ది రోజులకు ముందే ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ బిగించినట్లు స్థానికులు తెలిపారు. వేకువజామున దుండగులు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఊడదీసి ఎత్తుకెళ్లారని తెలిపారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్తున్న రైతులు విద్యుత్ స్తంభంపై ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడాన్ని గమనించి విద్యుత్ బోర్డు అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దోపిడిదొంగలు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను కొంత దూరం వరకూ మోసుకెళ్లి అందులోని ముడి పరికరాలు, రాగి వైర్లను చోరీ చేసుకెళ్లారని కనుగొన్నారు. ఈ సంఘటనపై తిరువళ్లూరు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఇన్‌స్టాలో రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు.. యువకుడి అరెస్ట్

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో ఇరువర్గాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లా మడత్తుపట్టి కీళ వీధికి చెందిన కలైఅరసన్ (20) సామాజిక మాధ్యమాల్లో ఇరువర్గాలను రెచ్చగొట్టేలా వీడియోలు, చిత్రాలు పోస్ట్ చేశారని దేవర్‌కుళం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. దీనిపై ఎస్ఐ లూక్ హసన్ విచారణ చేపట్టి, సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన కలైఅరసన్‌ను శనివారం అరెస్ట్ చేశారు. కాగా, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా, మతభావాలు రెచ్చగొట్టేలా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు, చిత్రాలు పోస్ట్ చేసే వారిపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ సిలంబరసన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

ప్రజా ఆస్తులు ధ్వంసం.. టీవీకే కార్యకర్తలపై కేసు

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాగపట్టణంలో ప్రజా ఆస్తులు ధ్వంసమైన వ్యవహారంలో టీవీకేకు చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. నాగపట్టణంలో శనివారం తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ ప్రచార సభ జరిగింది. పుత్తూర్‌లో అన్నా విగ్రహం వద్ద ప్రచారం చేస్తున్న సమయంలో, వేలాంకన్ని ఆరోగ్య మాత కల్యాణ మండపం ప్రహరీ గోడపై కార్యకర్తలు ఎక్కడంతో గోడ కూలినట్లు సమాచారం. విచారణ చేపట్టిన పోలీసులు, ఆ పార్టీకి చెందిన ఐదుగురు నాయకులపై కేసు నమోదుచేశారు. ప్రచారం సమయంలో, ప్రజా ఆస్తులు, ప్రజలకు భంగం కలిగించరాదని పోలీసు శాఖ టీవీకే నిర్వాహకులకు ముందుగానే తెలియజేసింది.

లారీలో తరలిస్తున్న పామాయిల్ అదృశ్యం

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా జయపురం ప్రాంతంలోని పతంజలి సంస్థకు చెందిన సుమారు ఒకటిన్నర మెట్రిక్ టన్నుల పామాయిల్, ట్యాంకర్ నుంచి అదృశ్యం కావడంపై పోలీసులు విచారణ చేపట్టారు. విల్లుపురానికి చెందిన శశికుమార్ తీసుకొచ్చిన ట్యాంకర్ లారీలో పామాయిల్‌కు బదులు నీరుందని ఆ సంస్థ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదుతో పరారైన లారీ డ్రైవర్ శశికుమార్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కెప్టెన్ కంటే విజయ్ ప్రభావం ఎక్కువ

● టీటీవీ దినకరన్

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాబోయే శాసనసభ ఎన్నికల్లో విజయకాంత్ కంటే విజయ్ ఎక్కువ ప్రభావం చూపిస్తారని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. తాంబరం శాసనసభ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశం శనివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో దినకరన్ మాట్లాడుతూ... డిసెంబరు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నామన్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో డీఎంకే, ఎన్డీఏ, విజయ్, సీమాన్ కూటముల మధ్య చతుర్ముఖ పోటీ ఉంటుందన్నారు. సెంగోట్టయన్‌తో తరచూ మాట్లాడుతున్నానని తెలిపారు. ఎన్నికల అనంతరం పళనిస్వామిని ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించి, పాత అన్నాడీఎంకే ఏర్పాటులో జయలలిత అభిమానుల చర్యలకు తాను మద్దతుగా ఉంటామని దినకరన్ తెలిపారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు ఇద్దరు వార్డెన్ల అరెస్ట్

చెన్నై, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలోని ఓ బాలికల వసతి గృహంలో 9వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపుల వ్యవహారంలో ఇద్దరు వార్డెన్లు అరెస్టయ్యారు. వార్డన్ అబూబకర్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని మహిళా వార్డెన్‌కు విద్యార్థినులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని మహిళా వార్డెన్ విద్యార్థినులను బెదిరించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఆ విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు వార్డెన్లు అబూబకర్, వహిదలను అరెస్ట్ చేశారు.

డీఎంకేను విమర్శించే అర్హత అన్బుమణి లేదు

● మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) డీఎంకేను విమర్శించే అర్హత అన్బుమణికి లేదని మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం తెలిపారు. కడలూరు జిల్లా వెల్లక్కరై సాతాన్‌కుప్పంలో జరిగిన 'నలం కాక్కుం స్టాలిన్' పథక శిబిరంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ... తండ్రి నుంచి పీఎంకేను చేజిక్కించుకోవాలని అన్బుమణి పాదయాత్ర చేపట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాంతంలో ఉన్న లక్షాధికారులు కోటీశ్వరులుగా ఎదిగారన్నారు. ఎంజీఆర్ పాలనలో రిజర్వేషన్ కోరుతూ ఆందోళన చేపట్టిన 18 వేల మందిపై కేసు నమోదుచేశారని, అనంతరం అధికారం చేపట్టిన కరుణానిధి, ఆ కేసులు రద్దు చేశారని గుర్తుచేశారు.

విజయంతంగా ముగిసిన

బ్రిడ్జ్ చాంపియన్‌షిప్



ట్రోఫీతో పోలాండ్ జట్టు సభ్యులు

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బ్రిడ్జి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈఫ బ్రిడ్జి ఇంటర్నేషనల్ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్ పోటీలు విజయవంతంగా ఆదివారం ముగిశాయి. రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూలోని ఈ పోటీలు జరిగాయి. ఆ తర్వాత విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఇందులో బ్రిడ్జ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ప్రసాద్ కేని ముఖ్య అతిథిగా, ఆర్గనైజింగ్ సెక్రటరీ దెబాశిష్ రాయ్, ఆర్గనైజింగ్ కమిటీ కో చైర్‌పర్సన్ ఎన్ఆర్ కృపామూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఈఫ బ్రిడ్జి ఇంటర్నేషనల్ విభాగంలో బంగారు పతకాన్ని పోలాండ్ జట్టు కైవసం చేసుకుంది. అలాగే, కేకేకే బ్రిడ్జి లవర్స్ జట్టు వెండి పతకాన్ని గెలుచుకుంది.

అధికార పార్టీకి వ్యతిరేకం కాదు : పార్తిబన్



తాను అధికార పార్టీకి వ్యతిరేకం కాదని దర్శక నిర్మాత నటుడు ఆర్. పార్తిబన్ అన్నారు. ధనుష్ హీరోగా నటించిన 'ఇడ్లీ కడై' చిత్రం ట్రైలర్ రిలీజ్ కోయంబత్తూరులో శనివారం రాత్రి జరిగింది. ఇందులో పార్తిబన్ పాల్గొని మాట్లాడుతూ, 'ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఐదేళ్ళ మనుగడ సాగించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఈ ఐదేళ్ళకాలంలో ప్రభుత్వం చేసిన తప్పొప్పులను ఎత్తి చూసేందుకు బ్యాలెట్ బాక్స్ ఉంది. వచ్చే యేడాది మన రాష్ట్రంలో ఎన్నికలు జరుగనున్నాయి. నేను అధికార పార్టీకి వ్యతిరేకం కాదు. ఇది ప్రజాస్వామ్య దేశం. ప్రజలు కూడా రాజకీయాలు తెలుసుకోవాలి. రాజకీయాల్లోకి ఎవరు వచ్చినా ఆహ్వానించాలి. నేను ఎవరి వద్దా డబ్బులు తీసుకుని హారతి పళ్ళెం పట్టడం లేదు. అందుకుని నోర్మూసుకుని ఉండలేను. మాటల్లో కాదు.. చేతల్లో చూపే గుండె ధైర్య, డబ్బుకు అమ్ముడుపోని నిజాయితీ నా దగ్గర ఉంది' అని పేర్కొన్నారు. ఇపుడు ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఎస్‌జే సూర్య అంగీకరిస్తే 'ఖుషీ' సెకెండ్ పార్ట్

చిత్రజ్యోతి

● ఏఎం.రత్నం

దర్శక నటుడు ఎస్‌జే సూర్య అంగీకరిస్తే 'ఖుషీ' రెండో భాగం సినిమా నిర్మించేందుకు సిద్ధమని ప్రముఖ నిర్మాత ఏఎం.రత్నం వెల్లడించారు. తమిళంలో విజయ్ - జ్యోతిక జంటగా నటించిన 'ఖుషీ' చిత్రాన్ని ఈ నెల 25వ తేదీన శక్తిఫిలిమ్స్ అధినేత శక్తివేల్ రీ రిలీజ్ చేయనున్నారు. దీన్ని పురస్కరించుకుని నిర్మాత ఏఎం.రత్నం, దర్శకుడు ఎస్‌జే సూర్య, నిర్మాత శక్తివేల్ శనివారం రాత్రి నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో ఏఎం.రత్నం మాట్లాడుతూ, 'ఇపుడు దేశ వ్యాప్తంగా పార్ట్-2 ట్రెండ్ కొనసాగుతుంది. అందువల్ల నా చిత్రాలన్నీ రెండో భాగం తెరకెక్కించేందుకు సిద్ధం. ఆ చిత్రాల్లో 'ఖుషీ' స్పెషల్. ఎస్‌జే సూర్య అంగీకరిస్తే ఖుషీ రెండో భాగాన్ని తెరకెక్కించేందుకు సిద్ధం. అందులో హీరోగా విజయ్ కుమారుడు నటిస్తారా? మరొకరు నటిస్తారా? అన్నది దర్శకుడి నిర్ణయం. ఆయన ఓకే చెబితే మాత్రం రెండో భాగం నిర్మించేందుకు సిద్ధం' అని పేర్కొన్నారు. ఎస్‌జే.సూర్య మాట్లాడుతూ, 'ఈ చిత్రాన్ని ఎంతగానో ఎంజాయ్ చేస్తూ తీశాం. ప్రేక్షకుడిగా ఈ చిత్రంలోని పాటలను చూసి ఎంజాయ్ చేశాను. కానీ, టెక్నీషియన్‌గా నచ్చదు. కెమెరామెన్ జీవా అద్భుతమైన ఛాయాగ్రహణం సమకూర్చారు. నటుడు వివేక్ నటన. వీరిద్దరు ఇపుడు మన మధ్య లేకపోవడం ఎంతో బాధగా ఉంది. తెలుగులో నాకు గుర్తింపు లభించిందంటే దానికి కారణం తెలుగులో తీసిన 'ఖుషీ' మూవీనే. ఈ సందర్భంగా నిర్మాత రత్నంకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. నిర్మాత శక్తివేలన్ ఒక ఫ్యాన్ బాయ్‌గా ముందుకు వచ్చి రీ రిలీజ్ చేస్తున్నారు. ఖుషీ ఒక ఎవర్ గ్రీన్ మూవీ. అది దేవుడు ఇచ్చిన బహుమతి' అన్నారు.



మీడియా సమావేశంలో రత్నం, ఎస్‌జే సూర్య, శక్తివేల్



ఆడియో రిలీజ్‌లో 'రైట్' చిత్ర బృందం

26 నట్టి - అరుణ్ పాండ్యన్ 'రైట్' విడుదల

ఆరీఎస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ పతాకంపై తిరుమాళ్ లక్ష్మణన్, టి.శ్యామలు సంయుక్తంగా నిర్మించిన 'రైట్' సినిమా ఈ నెల 26వ తేదీన విడుదలకానుంది. నటుడు నట్టి అలియాస్ నటరాజ్, సీనియర్ దర్శక నటుడు అరుణ్ పాండ్యన్ ప్రధాన పాత్రలు పోషించారు. నూతన దర్శకుడు సుబ్రహ్మణియన్ రమేష్ కుమార్ దర్శకత్వ వహించారు. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని చిత్ర బృందం శనివారం నగరంలో మీడియా సమావేశం నిర్వహించింది. ఇందులో చిత్ర దర్శకుడు మాట్లాడుతూ, 'నేను ఈ సినిమా చేయడానికి కారణం నట్టి. ఒకే చోట జరిగే కథతో నటీనటులను హ్యాండిల్ చేయడం చాలా కష్టం. అరుణ్ పాండ్యన్‌తో కలిసి 'అన్బిర్కినియాల్' సినిమా కోసం పనిచేశాను. ఈ స్టోరీ విని నటించేందుకు ముందుకు వచ్చారు. ఏదైనా సమస్య వస్తే పోలీస్ స్టేషన్‌కు వెళతాం. అదే పోలీస్ స్టేషన్‌కే ఒక సమస్య వస్తే ఏమవుతుంది? అన్నదే ఈ చిత్ర కథాంశం అని పేర్కొన్నారు.

అది ఇప్పటికీ బాధపెడుతూనే ఉంది

● అనుపమ పరమేశ్వరన్



తాను చేసిన ఓ చిన్న తప్పు తన మనసును తీవ్రంగా గాయపరిచిందని, అది ఇప్పటికీ సరిదిద్దుకోలేనిదిగా తన జీవితంలో మిగిలిపోయిందని హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ అన్నారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఓ మిత్రుడితో కొన్ని కారణాల వల్ల మాట్లాడటం మానేశాను. అయితే, అతను నాకు ఓ మెసేజ్ చేశారు. దానికి ముందు రెండు రోజుల క్రితం అతన్ని చూశాను. కానీ, మాట్లాడలేదు. పైగా అతను పంపిన మెసేజ్‌కు కూడా నేను రిప్లై ఇవ్వలేదు. కారణం.. అతడి వల్ల ఇకపై ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకూడదని భావించాను. కానీ, రెండు రోజుల తర్వాత అతను బ్లడ్ క్యాన్సర్‌తో చనిపోయినట్టు తెలిసింది. ఇదే అతను చనిపోయేముందు నాకు పంపిన మెసేజ్‌లో చెప్పాడు. కానీ, నేను ఇలా ప్రవర్తించడం మనసును ఎంతగానో గాయపరిచింది. ఇప్పటికీ అది ఒక మాసిపోని జ్ఞాపకంగా మిగిలిపోయింది' అన్నారు.

'యమ్‌డన్' బాంబు దాడికి 111 యేళ్లు..

మద్రాస్ చరిత్రలో 'కాళరాత్రి'



పేలని బాంబుతో బ్రిటిష్ సైనికుడు

● అర్ధరాత్రి ఫిరంగి గుండ్ల వర్షం
● ప్రాణభయంతో పరుగెత్తిన జనం
● నాటి ఘటనకు మిగిలిన గుర్తులు



బాంబుల దాడిలో దగ్ధమవుతున్న భవనాలు

(టి.నగర్, ఆంధ్రజ్యోతి)

1914 సంవత్సరం సెప్టెంబరు 22, సమయం సుమారు రాత్రి 10 గంటలు...!

ప్రస్తుతం చెన్నైగా పిలువబడుతున్న అప్పటి మద్రాసు నగరమంతటా నిశ్శబ్దవాతావరణం. ఆ సమయంలో జర్మనీకి చెందిన 'యమ్‌డన్' యుద్ధనౌక నగరానికి 2 నాటికల్ మైళ్ల దూరంలో నిలిచింది. తమ అనుమతి లేకుండా వచ్చిన ఆ యుద్ధనౌకను చూసి హార్బర్ అధికారులు అక్కడి నుండి పంపించేందుకు సన్నద్ధమయ్యారు. ఆ లోగా ఆ నౌక నుంచి రాకెట్ వేగంతో వచ్చిన 130కి పైగా బాంబులు నగరం నలువైపులా పడి పేలాయి. మద్రాసు హైకోర్టు ప్రాంగణం, హార్బర్‌లోని బ్రిటిష్ నావికాదళం అధికారుల క్లబ్, జనరల్ హాస్పిటల్, వేప్పేరి, నుంగంబాక్కంలో హడ్డోస్ రోడ్డు, పూందమల్లి, హైకోర్టు, రాయపురం తుపాకుల కర్మాగారం, కాసా మేజర్ రోడ్డు, జార్జ్‌టవున్ తదితర ప్రాంతాలు ఆ బాంబుల దాడికి గురయ్యాయి. యమ్‌డన్ నౌకనుండి హైకోర్టుపై దూసుకొచ్చిన ఓ బాంబు పేలింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు. హైకోర్టు ప్రహరీ కొంత భాగం ధ్వంసమైంది. ఆ బాంబుదాడి సమాచారాన్ని తెలిపే చిన్న శిలాఫలకం రాజాజీ విగ్రహం వెనుకవైపు హైకోర్టు ప్రహరీ వద్ద ఉంది. బ్రిటిష్ ప్రభుత్వానికి చెందిన బర్మా ఆయిల్ కంపెనీలోని నాలుగు ట్యాంకులపై కూడా బాంబులు పడ్డాయి. ఆ ట్యాంకుల్లోని 3.5 లక్షల గ్యాలెన్ల ముడిచమురుకు నిప్పంటుకుంది. యమ్‌డన్ యుద్ధనౌకలోని ఫిరంగుల నుండి వచ్చిన బాంబుల్లో ముప్పావు శాతం బాంబులు పేలకుండా అక్కడక్కడా పడ్డాయి. ఐరోపాలో మిత్ర దేశాలు బ్రిటిన్, ఇటలీ, రష్యా, శత్రు దేశాలుగా జర్మనీ, ఆస్ట్రియా, హంగేరి, బల్గేరియా, టర్కీ రెండు వర్గాలుగా ఏర్పడి ఒక దానికొకటి వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. అదే మొదటి ప్రపంచ యుద్ధంగా పేరుగడించినా, యుద్ధం ప్రధానంగా ఐరోపా కేంద్రంగా చేసుకుని కొనసాగింది. దీంతో ఐరోపాకు ఎన్నో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారతదేశంపై అందులోనూ దక్షిణ భారతదేశంలోని మద్రాసు నగరంపై జర్మనీ, దాని మిత్ర దేశాలు కలిసి బాంబు దాడులకు పాల్పడతాయని ఆంగ్లేయ అధికారులు ఊహించలేదు.

యమ్‌డన్ జలసమాధి...

మద్రాసునగరంలో యమ్‌డన్ యుద్ధనౌక జరిపిన ఆకస్మిక బాంబు దాడులను జర్మనీ సహా శత్రుదేశాలు తమకు విసిరిన ప్రత్యక్షసవాలుగా బ్రిటిష్ ప్రభుత్వం పరిగణించింది. దీంతో ఆ యుద్ధనౌకను గుర్తించి ధ్వంసం చేయాలని బ్రిటిష్ నావికాదళం నిర్ణయించింది. మద్రాసు నగరంపై దాడులకు పాల్పడిన 50 రోజుల తర్వాత 1914వ సంవత్సరం నవంబర్ 9న కోకోస్ దీవుల సమీపంలో యమ్‌డన్ యుద్ధనౌకను బ్రిటిష్ నావికాదళానికి చెందిన మూడు నౌకలు చుట్టుముట్టాయి. వాటిలో ఒకటైన హెచ్‌ఎంఏఎస్ సిడ్నీ యుద్ధ నౌక జరిపిన బాంబుల దాడిలో యమ్‌డౌన్ యుద్ధ నౌక జలసమాధి అయ్యింది.

బాంబుల దాడికి కారణాలెన్నో...


మొదటి ప్రపంచయుద్ధంలో భారతదేశం ప్రత్యక్షంగా పాల్గొనకపోయినా, బ్రిటిష్ ప్రభుత్వానికి మద్ధతుగా సుమారు 15 లక్షలమంది భారతీయ సైనికులు ఆ యుద్ధంలో పాల్గొన్నారు. అంతేకాకుండా 1.7 లక్షల గుర్రాలు, ఒంటెలను ఎగుమతి చేసి బ్రిటన్‌కు యుద్ధంలో అన్ని విధాలా సహాయసహకారాలను అందించింది. ఇలా బ్రిటన్‌కు పరోక్ష మద్ధతిచ్చి సహకరించిన భారతదేశంపై కక్ష తీర్చుకోవాలని జర్మన్ నిర్ణయించింది. భారతదేశంలోని ప్రముఖ నగరాలపై బాంబుల దాడి జరపాలని తీర్మానించింది. ఏ నగరాన్ని దాడికి ఎంపిక చేయాలో తెలియక సతమతమైంది. ఆ సమయంలో యమ్‌డౌన్ యుద్ధనౌక కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న లెఫ్టినెంట్ కర్నల్ వాన్ ముల్లర్ జర్మన్ పాలకుల ఆదేశాల కోసం ఎదురు చూడకుండా.. తనకు తోచిన ప్రాంతంలో బాంబు దాడి చేస్తూ శరవేగంగా దూసుకు వెళ్లారు. తమ ప్రభుత్వం భారతదేశంపై దాడి చేయాలని అనుకుంటోందన్న సమాచారం ఆయనకు అందింది. అంతే.. అప్పటికప్పుడు తన నిర్ణయాన్ని అమలు చేయాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా, సముద్రతీరానికి చేరువగాను, బ్రిటిష్ సంస్థల చమురు ట్యాంకర్లు అధికంగా ఉన్న మద్రాసు నగరాన్ని ఎంపిక చేసుకున్నాడు. గంటకు 25.1 నాటికల్ మైళ్ల వేగంతో (గంటకు 46.3 కి.మీల. వేగంతో) నౌక నడిపించి మద్రాసు తీరానికి చేర్చాడు. అనుకున్నట్లే మద్రాసు నగరంపై బాంబుల వర్షం కురిపించాడు. ఆ సంఘటనతో ప్రపంచంలోని ఏ మారుమూల ప్రాంతంలోనైనా బాంబు దాడులు చేసే సత్తా ఉందంటూ బ్రిటిష్ ప్రభుత్వానికి జర్మన్ పాలకులు చాటుకున్నారు. కానీ మద్రాసు నగరంపై దాడిని ఏ మాత్రం సహించని బ్రిటిష్ ప్రభుత్వం ఆ నౌకను జలసమాధి చేయగలిగింది. యమ్‌డన్ నౌక కెప్టెన్ లెఫ్టినెంట్ కర్నల్ వాన్‌ముల్లర్ చివరిదాకా ధైర్యంగానే పోరాడాడు. బ్రిటిష్ నౌకలు చుట్టుముట్టి చేసిన దాడిలో యమ్‌డన్ నౌకలో సగం మంది ప్రాణాలుకోల్పోయారు.. మిగతా సగం మంది బ్రిటిష్ నావికదళానికి లొంగిపోయారు. బ్రిటిష్ నావికాదళం జరిపిన 'ముప్పేటదాడి'లో యమ్‌డౌన్ నౌక సముద్రంలో జలసమాధి అయినప్పటికీ జర్మన్ చక్రవర్తి విలియం కైజర్ తమ ప్రభుత్వం ధైర్యసాహసాలకు, పరాక్రమానికి ఇచ్చే జర్మన్ పతకం 'ఐరన్ క్రాస్'ను దానికి ప్రకటించి ఘన నివాళులర్పించారు. ఆ నౌకలో పనిచేసి దాడుల్లో ప్రాణాలతో తిరిగొచ్చిన నావికాదళం సభ్యులందరూ తమ పేర్ల ముందు 'యమ్‌డన్' అని 'నిక్‌నేమ్' చేర్చుకునేందుకు జర్మన్ ప్రభుత్వం అనుమతించడం కొసమెరుపు. మద్రాసు నగరవాసులను భయభ్రాంతులకు గురిచేసిన యుద్ధనౌక 'యమ్‌డన్' బాంబుల దాడి జరిగి నేటితో 111 సంవత్సరాలు గడిచాయి. అయినా 'యమ్‌డన్' అనే పదం నగరవాసుల నోళ్లల్లో ఇంకా నానుతూనే ఉంది. తన నిర్ణయాలను గుట్టుచప్పుడు కాకుండాఅమలు చేసే మనస్తత్వం కలిగిన వ్యక్తిని, ఏ నిమిషానికి ఎలా ప్రవర్తిస్తాడో ఎవరికీ అంతుబట్టని వ్యక్తిని 'వాడొక యమ్‌డన్‌రా' అంటూ పిలవటం నగరవాసులకు ఆనవాయితీగా మారింది. 'యమ్‌డన్' అనే ఆ పదం ఇప్పటికీ రాష్ట్రంలోని ఏ మూలనో, ఎవరినోటో వినిపిస్తూనే ఉంటుందని చెప్పటం అతిశయోక్తి కానే కాదు!

నవరాత్రి వేడుకల్లో బిజీ...

బాంబుల దాడికి ముందు మద్రాసు నగరంలో ఎప్పటివలెనే సాధారణ పరిస్థితులే కొనసాగాయి. నవరాత్రి వేడుకల సందర్భంగా దీపాల వెలుగులతో నగరం వెలిగిపోతోంది. హార్బర్‌లో ఉన్న బ్రిటిష్ నావికా దళం ఉన్నతాధికారుల క్లబ్‌లో సందడి అధికమైంది. అధికారులు విందు, వినోదాల్లో తలమునకలయ్యారు. ఆ సమయంలో ముందస్తు హెచ్చరిక లేకుండా వచ్చిన యమ్‌డన్ యుద్ధనౌక పది నిమిషాల్లో మద్రాసు నగరవాసులను భయభ్రాంతులకు గురిచేసింది. ఎంత వేగంతో వచ్చి నగరంపై బాంబుల వర్షం కురిపించిందో, అంతే వేగంతో ఆ నౌక తూర్పు దిశగా మాయమైంది. బాంబు దాడుల్లో ముగ్గురు మృతి చెందగా.. 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. యమ్‌డన్ యుద్ధనౌక జరిపిన బాంబుల దాడికి జరిగిన నష్టం స్వల్పమే అయినా, ఆ బాంబుల దాడి నగరవాసుల్లో గుండెల్లో రైళ్లు పరుగెత్తించాయి. యమ్‌డన్ దాడులు జరిగినప్పుడు మద్రాసు ప్రావిన్స్ గవర్నర్‌గా ఉన్న బెంట్‌లాండ్ ఊటీలో ఉన్నారు. బాంబు దాడుల సమాచారం అందగానే వెంటనే బయలుదేరి మూడు రోజుల తర్వాత నగరానికి తిరిగివచ్చారు. రెండు మూడు రోజులపాటు నగరంలో పరిస్థితులను చక్కదిద్ది మళ్ళీ ఊటీలో రెస్ట్‌కోసం వెళ్ళారు.




మద్రాసు ప్రావిన్స్ గవర్నర్ బెంట్‌లాండ్




యమ్‌డన్ నౌక నడిపిన లెఫ్టినెంట్ కర్నల్ వాన్ ముల్లర్

గవర్నర్ తీరుతో నగరం ఖాళీ...


గవర్నర్ మళ్ళీ ఊటీకి వెళ్ళారని తెలియగానే నగరవాసులు మరింత భయభ్రాంతులకు గురయ్యారు. మళ్ళీ నగరంపై బాంబు దాడులు జరుగుతుందన్న భయంతోనే గవర్నర్ వెళ్లిపోయారనే అనుమానం ప్రజల్లో తలెత్తింది. దీంతో నగరవాసులు నగరాన్ని విడిచి సురక్షిత ప్రాంతాలను వెదుక్కుంటూ వలసపోసాగారు. ఆ సమయంలో నగరంలో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్నంటాయి. నగరవాసుల్లో నెలకొన్న భయాన్ని తొలగించేందుకు మద్రాసు ప్రావిన్స్ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కూడా తమిళంలో కరపత్రాలు ముద్రించి నగరమంతటా పంపిణీ చేశారు. అందులో 'జర్మన్ బాంబుల దాడికి పరితపిస్తున్న పట్టణవాసులు' అనే శీర్షికతో యమ్‌డౌన్ బాంబు దాడికి భయపడాల్సిన పనిలేదంటూ ప్రజలలో ధైర్యాన్ని నింపే నినాదాలు, ఆసక్తికరమైన బొమ్మలు ముద్రించారు. వాటిని ఇంటింటికీ వెళ్ళి పంపిణీ చేశారు. నెలరోజుల తర్వాతే నగరాన్ని విడిచి వెళ్ళినవారంతా తిరిగొచ్చారు.



ధ్వంసమైన నేవీ ఆఫీసర్ల క్లబ్ - హైకోర్టు ప్రహరీ దగ్గర శిలాఫలకం - జర్మన్ మ్యూజియంలోని యమ్‌డన్ నౌక ఊహాచిత్రం



యమ్‌డన్ బాంబుల దాడి భయాన్ని తొలగిస్తూ తమిళంలో ముద్రించిన కరపత్రాలు



దగ్ధమవుతున్న బర్మాకంపెనీ ఆయిల్ ట్యాంక్‌లు

వాసవీ మాట్రిమోనియల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

● ఆత్మీయసభలో కొనియాడిన వక్తలు

ప్యారీస్, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): లాభాపేక్ష లేకుండా ఆర్యవైశ్యుల సంక్షేమమే లక్ష్యంగా శ్రీవాసవీ మాట్రిమోనియల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న కేవీఆర్ ఎస్‌ఏ రాజు సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. చూలై ప్రాంతంలో ఎస్‌కేపీడీ నిర్వహిస్తున్న మహర్షి విద్యామందిర్ సీనియర్ సెకండరీ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉదయం పాఠశాల కరస్పాండెంట్, ట్రస్టీ టీవీ.రామకుమార్ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ ఎం.రమేష్ అతిథులను సభకు పరిచయం చేశారు. అతిథులుగా టీటీడీ చెన్నై సలహా మండలి మాజీసభ్యులు పీవీఆర్ కృష్ణారావు, ఆంధ్ర కళా స్రవంతి కోశాధికారి జీవీ.రమణ, ఇన్‌కంటాక్స్ మాజీ చీఫ్ కమిషనర్ జీవీ.గోపాలరావు, కె.సుదర్శన్ తదితరులు పాల్గొని వాసవీ మాట్రిమోనియల్ ఛారిటబుల్ ట్రస్టీ వ్యవస్థాపక ఛైర్మెన్ కేవీఆర్ఎస్ఏ రాజు దంపతులను సత్కరించారు. అనంతరం సభాధ్యక్షులు రామకుమార్ మాట్లాడుతూ, ఆర్యవైశ్య కుటుంబాల్లో పెళ్లీడుకు వచ్చిన యువతీ,యువకులు జాతకాలు, విద్యార్హత తదితర వివరాలను సేకరించి, మాట్రిమోనియల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా తెలియజేస్తూ బెంగుళూరును కేంద్రంగా చేసుకుని రాజు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.



కేవీఆర్ఎస్ఏ రాజు దంపతులను సత్కరిస్తున్న వైశ్య ప్రముఖులు



క్యాంపు ఆఫీసులో ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న చెంబరంబాక్కంకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ప్రగ్యా జైన్, కుటుంబ సభ్యులు. ఆ విద్యార్థి సమర్పించిన వినతి పత్రం మేరకు ఈ భేటీ జరిగింది.



అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

పురటాసి తొలి ఆదివారం

● నామక్కల్ ఆంజేయుడికి ప్రత్యేక అభిషేకాలు

అడయార్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పురటాసి నెల తొలి ఆదివారం సందర్భంగా నామక్కల్ ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, దీపారాధనలు నిర్వహించారు. నామక్కల్‌లో ప్రసిద్ధి చెందిన ఆంజనేయ స్వామి ఆలయంలో ఒకే రాయితో రూపొందించిన 18 అడుగుల స్వామివారి విగ్రహం ఉంది. ఈ క్రమంలో, ఆదివారం పురటాసి నెల తొలి ఆదివారం కావడంతో స్వామి వారి విగ్రహానికి 1,008 వడమాల వేశారు. అనంతరం భట్టాచార్యులు క్షీరాభిషేకం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. పంచామృతం, పసుపు సహా సుగంధద్రవ్యాలతో అభిషేకాలు చేసి, పూల అలంకరణ చేశారు.

ఘనంగా 'వేల్స్ వర్సిటీ స్కూల్ ఆఫ్ లా' వార్షికోత్సవం

పెరంబూర్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'వేల్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా', చెన్నై 10వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వర్సిటీ ప్రాంగణంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్, గౌరవ అతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహాదేవన్, విశిష్ట అతిథిగా మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మహీంద్ర మోహన్ శ్రీవాస్తవ హాజరయ్యారు. అలాగే, ప్రత్యేక అతిథులుగా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.నిర్మల్‌కుమార్, జస్టిస్ జీకే ఇళందిరయన్, జస్టిస్ డి.భరత చక్రవర్తి, జస్టిస్ ఆర్.కలైమది, తమిళనాడు-పుదుచ్చేరి బార్ కౌన్సిల్ ఛైర్మెన్ ఎమ్మెస్ అమలరాజ్, భారత లా కమిషన్ మాజీ సభ్యులు డా.ఎస్.శివకుమార్ హాజరయ్యారు. వేల్స్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ డా.ప్రీతా గణేష్ ఆహ్వానం పలికిన ఈ కార్యక్రమంలో, వర్సిటీ ఛాన్సలర్ డా.ఐసరి గణేష్ అతిథులను, ప్రముఖులను సత్కరించారు. అనంతరం స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ ఎస్.అంబిక కుమారి కళాశాల అభివృద్ధి, అందిస్తున్న కోర్సులు, ఉత్తీర్ణులైన విద్యార్థుల సంఖ్య తదితరాలను వివరించారు. వర్సిటీ ఛాన్సలర్ డా.ఐసరి గణేష్ స్కూల్ ఆఫ్ లా కళాశాల అద్భుతమైన ప్రయాణాన్ని వివరించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. ఈ స్కూలులో చదివిన విద్యార్థులు హైకోర్టు న్యాయమూర్తులు, ప్రముఖ న్యాయవాదులుగా ఎదగడం అభినందనీయమన్నారు. న్యాయవాద వృత్తి కేవలం జీవనోపాధి సాధనం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేసేదన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు.



విజేతలతో అతిథులు, నిర్వాహకులు



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు‘గండం’

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫోటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కొలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ‘మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం’ అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ అధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్నానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీకి కానుకగా క్లీనింగ్ యంత్రాలు



టీటీడీకి ఆదివారం 18 క్లీనింగ్ యంత్రాలు కానుకగా అందాయి. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా ఐడీబీఐ బ్యాంకు రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ యంత్రాలను అందజేసింది. ఆదివారం ఉదయం ఆలయం ముందు ఈ యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంకు ఎండీ, సీఈవో రాకేష్ శర్మ ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఐడీబీఐ రీజనల్ హెడ్ సాయికృష్ణ, బ్రాంచ్ హెడ్ మేనేజర్ రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళం

తిరుమల, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి ఆదివారం రూ.20 లక్షల విలువైన రాస్ స్ట్రీట్ ఆర్‌ఓ 1500 రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళంగా అందింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మల్టీ పర్పస్ క్లీనింగ్ కోసం ఉపయోగించేందుకు ఈ మిషన్‌ను అందజేసింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి బ్యాంక్ జీఎం పత్రి శ్రీనివాస్ మిషన్‌ను అందజేశారు. అనంతరం అదనపు ఈవో ఈ మిషన్‌ను కొద్ది దూరం నడిపి పనితీరును పరిశీలించారు.



శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.4.59 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,042

తలనీలాలు సమర్పించినవారు: 23,393





డ్రగ్స్‌కు నో చెబుదాం జీవితాలను కాపాడుకుందాం

- యువతకు పిలుపునిచ్చిన ఎస్పీ సుబ్బరాయుడు
- ఘనంగా నమో యువరన్ 3కె ర్యాలీ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ‘డ్రగ్స్‌కు నో చెబుదాం. విలువైన జీవితాలను కాపాడుకుందాం. డ్రగ్స్ నిర్మూలనకు పోరాడుదాం. నవయుగ భారత్‌ను నిర్మిద్దాం’ అంటూ ఎస్పీ సుబ్బరాయుడు యువతకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బీజేవైఎం అధ్వర్యంలో ఆదివారం ‘నమో యువ రన్ 3కె ర్యాలీ’ ఆదివారం తిరుపతిలో జరిగింది. మత్తు పదార్థాలు శరీరానికి హాని చేయడంతో పాటు జీవితాలనూ నాశనం చేస్తాయని ఎస్పీ వివరించారు. ఒక్కసారి అలవాటుపడితే సర్వం కోల్పోతారన్నారు. ఎవరికైనా డ్రగ్స్ వాడినా, అమ్మినా ఆ వివరాలను రాష్ట్ర టోల్ ఫ్రీ నెంబరు 1972కు, తిరుపతి జిల్లా నెంబరకు 1908కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. యుతను జాగృతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి బాలాజీ కాలనీ, గాంధీరోడ్డు, తిలక్‌రోడ్డు మీదుగా తుడా ఇందిరా మైదానం వరకు కే రన్ సాగింది. వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, యువమోర్చా నాయకులు హరికృష్ణ, పృథ్వీ, కిషన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగైతే అలిపిరిలో తల నరుక్కుంటా: భూమన



తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణికి సంబంధించి తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో ఘటన జరిగి ఉంటే అలిపిరి వద్ద తల నరుక్కుంటానని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వ్యాఖ్యానించారు. అలా కాని పక్షంలో లోకేశ్, బీఆర్ నాయుడు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘కొందరు సీసీ ఫుటేజ్ అంటూ హడావుడి చేస్తున్నారు. గత 20 ఏళ్లుగా పరకామణిలో రవికుమార్ చోరీ చేస్తున్నారని అంటున్నారు. అలా జరిగి ఉంటే గత చంద్రబాబు పాలనలో 15 సంవత్సరాలకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఎందుకు బయట పెట్టడంలేదు. రవికుమార్‌ను మా ప్రభుత్వ హయాంలోనే పట్టుకున్నాం. ఈ ఘటనకు సంబంధించి ప్రాయశ్చిత్తంగా అతడి నుంచి రూ.14 కోట్ల మార్కెట్ విలువ చేసే ఆస్తులను టీటీడీకి అప్పగించడం జరిగింది. ఆ ఆస్తి విలువ రూ.100కోట్ల వరకు ఉంటుంది. సీబీసీఐడీ కాదు సీబీఐ చేత విచారణ జరిపించండి. ఏ విచారణనైనా ఎదుర్కొంటాం’ అని పేర్కొన్నారు.

సెటిల్మెంట్ చేయడానికి మీరెవరు?

- భూమనకు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్న



తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ‘శ్రీవారి పరకామణిలో రవికుమార్ దొంగిలిస్తే మిగిలిన గజదొంగలు పంచుకున్నారు. ఆ దొంగ సొత్తును సెటిల్‌మెంట్ చేయడానికి మీరెవరు? మీకేం అర్హత ఉంది’ అంటూ భూమన కరుణాకరరెడ్డిని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పరకామణి చోరీ గురించి తనకు ఏం సంబంధంలేదని భూమన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రవికుమార్‌పై కేసు పెట్టినప్పటినుంచి భూమన టీటీడీ పాలకమండలిలో ఉన్నారన్నారు. పరకామణి దొంగతనంపై సాక్ష్యాధారాలతో బయటపెట్టినప్పటి నుంచి ఆయనలో భయం పట్టుకుందన్నారు. రవికుమార్‌నుంచి భూమన రూ.400కోట్లు తీసుకున్నారన్నారు. భూమన టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడు స్విమ్స్‌లో మందుల షాపుల కాంట్రాక్టరు నుంచి కూడా ముడుపులు తీసుకున్నారని, త్వరలోనే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

గొడుగుల ఊరేగింపులో కానుకలు ఇవ్వకండి

- భక్తులకు టీటీడీ సూచన

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవనాడు అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు ఎలాంటి కానుకలు ఇవ్వద్దని టీటీడీ కోరింది. భక్తులు అందించే ఈ కానుకలు టీటీడీకి చేరవని స్పష్టం చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకువచ్చి స్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ గొడుగులు 27వ తేదీన తిరుమలకు చేరుకుంటాయని టీటీడీ పేర్కొంది.

ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం

- ఒకరి అరెస్టు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద జీనోజ్ అనే వ్యక్తి అదుపులోకి తీసుకుని, 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సీఐ రమణ తెలిపారు.ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రం కాలింగాల్ జిల్లాకు చెందిన ఆర్.జీనోజ్ ఈనెల 20వ తేదీన ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వెంకటగిరి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో నిఘా పెట్టామన్నారు. వెంకటగిరి రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన జీనోజ్ కదలికలు అనుమానాస్పదంగా ఉండడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద 1.5కిలోల గంజాయి లభ్యమైందని సీఐ తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.



శివప్రసాద్‌కు నివాళి అర్పిస్తున్న ప్రీతమ్

శివప్రసాద్‌కు ఘన నివాళి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డాక్టర్ నారమల్లి శివప్రసాద్ ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన మనవడు, పీఎం గ్రూప్ అధినేత కేతన్ శివప్రీతమ్ నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులతో కలసి అగరాలలోని శివప్రసాద్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, టీటీడీబోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి

సృజనాత్మకతకు అద్దంపట్టిన కళాంగిని వేడుక

- ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల పాటు జరిగిన కళాంగిని వేడుక ఔత్సాహిక విద్యార్థులు, సీనియర్ ఆర్టిస్టుల సృజనాత్మకతకు అద్దం పట్టాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడులోని తిరుపతి ఐఐటీలో ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని వేడుక పేరిట శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ నిర్వహించగా ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరిగింది. ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీటెక్, ఎంటెక్ రీసెర్చ్ వంటి కోర్సులతో నిత్యం బిజీగా ఉండే ఐఐటీ విద్యార్థులు ఆర్ట్ క్లబ్ తరఫున ఇలాంటి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. రోజువారి చదువుల ఒత్తిడి నుంచి ఈ తరహా కార్యక్రమాలు మానసిక ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఇదొక ఆట విడుపు మాత్రమే కాకుండా విద్యార్థుల్లోని ప్రతిభను, సృతజనాత్మకతను వెలికి తీస్తుందన్నారు. దీనికి ఐఐటీతో పాటు ఐసర్ విద్యార్థులు పాల్గొనడం మంచి పరిణామమన్నారు. తిరుపతి నుంచి సీనియర్ మహిళ ఆర్టిస్టులు వర్క్‌షాప్‌లో పాల్గొని ఐఐటీ, ఐసర్ విద్యార్థులకు వివిధ రకాల పెయింటింగ్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఔత్సాహిక విద్యార్థుల కళారూపాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలను తరచూ నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.కృష్ణకుమార్, డీన్ ఎస్ఎస్ మూర్తి, వీఆర్వో చమన్ మెహతా, ఆర్టిస్టులు అర్చన, గాయత్రిదేవి, శ్రీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.